సాక్షి నిజామాబాద్

శనివారం ¦ 13 ¦ జనవరి ¦ 2024



ఏఎంసీలపై కన్ను..

వ్యవసాయ మార్కెట్ కమిటీలను సీఎం రద్దు చేయడంతో అధికార పార్టీ నాయకుల్లో, ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- 10లో ▸



పండుగల విశిష్టతను వివరించాలి..

నేటి తరానికి పండుగల విశిష్టతను వివరించాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీని పరిశీలించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం

32.9 /19.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. చలితీవ్రత ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్ ఇవ్వకపోతే కఠిన చర్యలు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రభుత్వానికి తిరిగివ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు తక్షణమే ఇవ్వాలని మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు మిల్లర్ల వైఖరి కారణంగా ప్రభుత్వానికి, రైతులకు, ఇతర మిల్లర్లకూ చెడ్డపేరు వస్తోందన్నారు. రుద్రూర్ ప్రాంతానికి చెందిన మిల్లర్లు ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకుని సీఎంఆర్ ఇవ్వకుండా బయట ప్రాంతాల్లో అమ్ముకున్నారన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీంతో కొందరు మిల్లర్లు యథేచ్ఛగా బియ్యాన్ని పక్కదారి పట్టించారన్నారు. గత వానాకాలం సీజన్‌కు సంబంధించి 22,005 మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి 3,09,284 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉందన్నారు. మళ్లీ సీజన్ వస్తున్నప్పటికీ ఇవ్వకపోవడం పూర్తి నిర్లక్ష్యమన్నారు. ఇవ్వకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటూనే సంబంధి త అధికారులను బాధ్యులను చేస్తామన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

● సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి : జిల్లా ప్రజలకు సంక్రాంతి సందర్భంగా సీపీ కల్మేశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది సంతోషంగా మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవడం మన సాంప్రదాయమన్నారు. ఎల్లప్పుడు ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు.

డీలర్లకు శిక్షణ



డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లావ్యాప్తంగా విత్తన, పురుగుమందులు, ఎరువులు విక్రయించే డీలర్లకు శుక్రవారం ఆత్మ ఏజెన్సీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో దేశీ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 48 వారాల పాటు జరిగే ఈ శిక్షణలో కోర్సును పూర్తి చేసుకున్న డీలర్లలో ఉత్తీర్ణత సాధించిన వారికి మేనేజ్ సంస్థ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు ఆత్మ పీడీ, రైతు శిక్షణ కేంద్రం డీడీ తిరుమల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డీపీడీ దైవ గ్లోరి, అమరేష్ పాల్గొన్నారు.

సిరికొండ పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసు



సిరికొండ: సిరికొండ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డిపై మెజారిటీ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. జిల్లా కేంద్రంలో డీసీవో సింహాచలంను శుక్రవారం కలిసి వారు అవిశ్వాస నోటీసు అందచేశారు. అవిశ్వాసం ప్రకటించి డీసీవోకు నోటీసు అందచేసిన వారిలో డైరెక్టర్లు గంగాధర్, చిన్నరెడ్డి, నర్సింహారెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీలత, నర్సయ్య, గంగవ్వ, లింగం, రమేశ్ ఉన్నారు.

దేశ భవిష్యత్తు యువత చేతిలోనే..



నిజామాబాద్‌అర్బన్ : దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకొని దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నేషనల్ యూత్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యాశాఖ సంయుక్తంగా ప్రారంభించిన 'పిల్లల కోసం తొలిమెట్టు' కమ్యూనిటీ మూమెంట్ కార్యక్రమంలో భాగస్వాములై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వారి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సాయం చేసేందుకు ఎన్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల వలంటీర్లు ముందుకొచ్చారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, వర్సిటీ ప్రోగ్రామ్ పోగ్రామ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సునీత, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్తారు

జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో వైద్యసేవలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో గర్భిణులు, బాలింతలు వైద్యం కోసం పడిగాపులు కాస్తున్నారు. సరిపడా మందులు, సిబ్బంది ఉన్నప్పటికీ చికిత్స చేసే వైద్యులు ఇష్టారాజ్యంగా జీజీహెచ్‌కు వస్తూ పోతున్నారు. బయోమెట్రిక్ హాజరు విధానం పటిష్టంగా అమలు కావడం లేదు. ఇది వైద్యులకు అనుకూలంగా మారింది. విధులకు సకాలంలో హాజరు కావడం లేదు.

- జీజీహెచ్‌లో ఇష్టారాజ్యంగా వైద్యుల రాకపోకలు
- ఓపీ 3 గంటలకే క్లోజ్..
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- రోగులకు తప్పని ఇక్కట్లు





నేత్రవైద్య విభాగంలో మధ్యాహ్నం మూడు గంటలకే వేసిన తాళం



జనరల్ మెడిసిన్ విభాగానికి తాళం
(సమయం : మ.3 గంటలు)

నిజామాబాద్ నాగారం : జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు రోగమొస్తే పెద్దదిక్కు గా ఉన్న జీజీహెచ్‌లో వైద్యులు వేళకు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఆర్థిక సమస్యలున్నప్పటికీ ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. రోగులు ఉదయం 6 గంటలకే వస్తున్నారు. వైద్యులు నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సి ఉన్నప్పటికీ చాలా తక్కువమంది మాత్రమే ఓపీల్లో ఉంటున్నారు. శుక్రవారం ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

లేటుగా వచ్చి..

జీజీహెచ్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీలో వైద్యులు ఉండి రోగులకు సేవలందించాలి. అయితే ఉదయం తొమ్మిదైనా కనిపించని వైద్యులు.. సాయంత్రం 3 గంటలకే వెళ్లిపోతున్నారు. తాపీగా 10 గంటలకు ఓపీ ప్రారంభించి పని ఉందంటూ కొందరు మధ్యలోనే ఆస్ప త్రి విడిచి వెళ్లిపోతున్నారు. మొత్తంగా ఒక రోజులో 2 గంటలు మాత్రమే వైద్యులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం మెడికోలు మాత్రమే మధ్యాహ్నం ఒంటిగంట వరకు సేవలందిస్తున్నారు.

పర్యవేక్షణ గాలికి..

జీజీహెచ్‌ను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాల్సిన చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వైద్యులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చే జీతాలు తీసుకుంటున్నారు కాని.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో విధులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లుగా రోగులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారని చర్చించుకుంటున్నారు. రోజురోజుకూ ఓపీ పెరుగుతున్నప్పటికీ దానికనుగుణంగా వైద్యం అందుతుందా లేదా అని పరిశీలించాల్సిన అవసరమున్నా అలా జరగట్లేదని రోగుల బంధువులు పేర్కొంటున్నారు.

మధ్యాహ్నానికే ఆస్పత్రి ఖాళీ..

ఇక మధ్యాహ్నం లంచ్ తర్వాత వైద్యులు ఒక్కరు కూడా రావట్లేదు. కొంతమంది రోగులు ఓపీల వద్దకు వెళ్తే ఎమర్జెన్సీ విభాగంలోకి వెళ్లి చూయించుకుని అక్కడ ఉన్న సెక్యూరిటీ, ఇతర సిబ్బంది సలహా ఇస్తున్నారు. దీంతో రోగులు ఎమర్జెన్సీలో ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు.

'ఎమర్జెన్సీ'లో మెడికోలతో వైద్యం



చికిత్స చేస్తున్న మెడికోలు

ఎమర్జెన్సీ విభాగం అంటేనే అత్యవసరంగా చికిత్సనందించాల్సిన పరిస్థితి. ఓపీ విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో చాలామంది రోగులు ఎమర్జెన్సీ విభాగానికి వెళ్తున్నారు. అక్కడ కేవలం మెడికోలు మాత్రమే రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఎమర్జెన్సీ విభాగానికి సంబంధించి సీఎంవో, ఇతర ఉన్నతస్థాయి వైద్యులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా వారి పేర్లు నోటీసు బోర్డుకే పరిమితమయ్యాయి. చికిత్సలో మెడికోలు, సీనియర్ రెసిడెంట్, జూనియర్ రెసిడెంట్లు అప్పుడప్పుడు తమ సేవలందిస్తున్నారు. ఎక్స్‌రే, స్కానింగ్ గదుల వద్ద పరిస్థితి మరింత గందరగోళంగా తయారైంది. అక్కడ క్యూలో నిలబడ్డ వారిని పట్టించుకోకపోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంటుంది.

విధులు మరిచి వేడుకలు

- సూపరింటెండెంట్ చాంబర్‌లో కోలాహలం
- అసహనం వ్యక్తం చేసిన రోగులు

నిజామాబాద్ నాగారం : జిల్లా జనరల్ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో బర్త్‌డే వేడుక రోగుల బంధువులకు అసహనాన్ని తెప్పించింది. సూపరింటెండెంట్ పుట్టిన రోజు సందర్భంగా ఆ చాంబర్‌ను ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో డెకోరేట్ చేసినట్లుగా తయారు చేసి సిబ్బంది అంతా విధులు పక్కనపెట్టి అక్కడ చేరి సంబురాలు నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ జన్మదిన వేడుక గురువారం జరుగగా, శుక్రవారం సాయంత్రమైనా కూడా ఆస్పత్రిలోని చాంబర్ అంతా ప్రైవేట్ ఫంక్షన్ హాల్ మాదిరిగానే కనిపించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ గతంలో కూడా ఆస్పత్రిలోనే తన బర్త్‌డే వేడుకల్లో ఫైర్‌గన్‌తో సంబురాలు జరుపుకున్నారు. ఆస్పత్రిలో రోగుల మధ్య ఇలా సంబురాలు జరుపుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

ఫైర్‌గన్‌తో ఏదైనా ప్రమాదమే జరిగితే బాధ్యులెవరని చర్చించుకున్నారు. ఇలా ఉన్నతాధికారులు, సిబ్బంది విధులు మరిచి వేడుకల్లో పాల్గొనడంపై రోగులు బంధువులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. సిబ్బంది కూడా ఈ వేడుకలపై విసుగ్గా ఉన్నప్పటికీ ఏమీ చేయలేక పాల్గొన్నామన్నారు.



సూపరింటెండెంట్ హాల్‌లో డెకొరేషన్

మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

- ఉత్తర్వులను జారీ చేసిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు
- 135 మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు పెరగనున్న వేతనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకుందంటున్న కార్యకర్తలు



స్వీట్ తినిపించుకుంటున్న కార్యకర్తలు

మోర్తాడ్(బాల్కొండ): మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్ వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తొలి రోజులలోనే తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో చర్చించారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే కార్యకర్తలకు పని భారం అధికంగానే ఉన్నా వేతనాల్లో ఎంతో తేడా ఉంది. అలాగే ఆయాలు లేకపోవడంతో అన్ని పనులు కార్యకర్తలే చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు అప్‌గ్రేడ్ చేయడం వల్ల వేతనం పెరగడంతో పాటు, ఆయా పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో 1,145 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 135 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.7,500 వేతనం చెల్లిస్తున్నారు. అప్‌గ్రేడ్ చేయడం వల్ల వారికి వేతనం రూ.13,500 వస్తుంది. అప్‌గ్రేడ్ విషయంలో ప్రభుత్వం గత డిసెంబర్ 2023లో నిర్ణయం తీసుకోగా ఈ రోజు ఉత్తర్వులను కార్యకర్తలకు అందించారు. అప్‌గ్రేడ్ చేయడం వల్ల తమ శ్రమకు తగిన గుర్తింపు లభించిందని కార్యకర్తలు చెబుతున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఇప్పటికి తమ కల ఫలించిందని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షులు దేవగంగు పేర్కొన్నారు.

ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు మెమోలు

కామారెడ్డి టౌన్: దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు గైర్హాజరు ఘటనపై డాక్టర్ జోహ ముజీబ్‌తో పాటు మరో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యలకు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ శుక్రవారం మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణివ్వాలని ఆదేశించారు. వారి నుంచి వివరణ వచ్చాక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని విచారణాధికారి డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు.

పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి



అవార్డులు అందుకున్న మహిళా ఉపాధ్యాయులు

- మహిళలు చదువునే ఆయుధంగా మార్చుకోవాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ గౌడ్

నిజామాబాద్‌అర్బన్ : పూలే దంపతులకు భారతరత్న ప్రకటించి వారి విగ్రహాలను పార్లమెంటులో ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 70 మంది ఉత్త మ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే పేరుతో 70మంది ఉత్తమ మ హిళా ఉపాధ్యాయులకు అవార్డులివ్వడం అభినందనీయమన్నారు. దేశంలో బీసీలకు జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లు 27 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్ మాట్లాడుతూ ఈరోజుల్లో మహిళలు ఉన్నత పదవులు అధిరోహిస్తున్నారంటే ఆ మహానుభావుల పుణ్యమేనన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళలు చదువుకుంటే ఆ ఇంటితో పాటు సమాజం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాల్, మేయర్ నీతూకిరణ్, డీఈవో దుర్గాప్రసాద్, బీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ విద్యావంతుల వేదిక ఎం.మారయ్య గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బీసీ ఉపాధ్యాయ సంఘం సుంకర శ్రీనివాస్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, ప్రవీణ్ గౌడ్, బీసీ ఉద్యోగ సంఘం నారాయణరెడ్డి, బీసీ ఉపాధ్యాయ సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి జిల్లాలో రోడ్లు రక్తసిక్తమయ్యాయి. రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. మరో ఇద్దరు త్రీవంగా గాయపడ్డారు. నిజామాబాద్‌లోని అశోక్ సాగర్ వద్ద ఐచర్ వ్యాన్‌ను ఓవర్ టేక్ చేస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. బైక్‌పై ఉన్న ముగ్గురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కామారెడ్డిలోని జంగంపల్లి వద్ద సైకిల్‌ను బుల్లెట్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు.



ఘటనా స్థలం వద్ద మృతదేహం

● కారు, బైక్ ఢీకొని ఇద్దరు మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- అశోక్‌సాగర్ వద్ద ఐచర్ వ్యాన్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదం





మృతులు సమీర్(ఫైల్), అనాస్ (ఫైల్)

ఎడపల్లి (బోధన్) : ఎడపల్లి మండలం జానకంపేట్ సమీపంలోని అశోక్ సాగర్ వద్ద శుక్రవారం సాయంత్రం 7 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన సమీర్ (28), అనాస్(30), కరీం కలిసి బైక్‌పై పని నిమిత్తం బోధన్ వైపు వెళ్తున్నారు. అశోక్ సాగర్ మూలమలుపు వద్ద ముందున్న ఐచర్ వ్యాన్ ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా అతి వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఆ తాకిడికి బైక్ పక్కనున్న ఐచర్ వ్యాన్‌కు ముగ్గురు ఢీకొని కారు కింద పడిపోయారు. ఈ ఘటనలో సమీర్, అనాస్ అక్కడికక్కడే మృతి చెందారు. మృత దేహాలను 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కరీంను మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. ఆరవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనీస్ (19) డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. సెలవులున్నందున నెహ్రూనగర్‌కు తల్లిదండ్రుల వద్దకు వచ్చి రోడ్డు ప్రమాదంలో అకాలమరణం చెందాడు. అనీస్ తండ్రి అర్సపల్లి సమీపంలోని ఆగ్రో ఇండస్ట్రీలో వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. మరో మృతుడు సమీర్ (22) జిల్లాకేంద్రంలో వెల్డింగ్ పనులు చేసేవాడు. అతని తండ్రి గతంలోనే చనిపోయారు.

● సైకిలిస్టును ఢీకొన్న బుల్లెట్

- ఇద్దరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



వెంకటి మృతదేహం

భిక్కనూరు: భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 8.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండ మండల కేంద్రానికి చెందిన నాయిని నిఖిల్‌రెడ్డి (22) తన స్నేహితుడైన పున్న సుమంత్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం కామారెడ్డికి వెళ్లారు. దోమకొండకు తిరిగి వస్తుండగా.. అదే సమయంలో సైకిల్‌పై రోడ్డు దాటుతున్న జంగంపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకటి (45)ని వేగంగా ఢీకొన్నారు. వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. బుల్లెట్ పై ప్రయాణిస్తున్న నిఖిల్‌రెడ్డి, అబ్రబోయిన సుమంత్‌లకు తీవ్రగాయలయ్యాయి. స్థానికులు వారిని కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా నిఖిల్‌రెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. సుమంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటి తాను పనిచేస్తున్న దాబా హోటల్‌లో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై అసువులు బాసాడు. వెంకటికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన తల్లి ఇటీవల మృతి చెందింది. నిఖిల్‌రెడ్డి అవివాహితుడు కాగా ట్రావెల్ నిర్వాహకుడుగా పని చేసేవాడు. కేసును దర్యాప్తు జరుపుతున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు.



జంగంపల్లి వద్ద ప్రమాదంలో మృతి చెందిన నిఖిల్‌రెడ్డి

క్లుప్తంగా

హిమాలయ పర్వతాన్ని అధిరోహించిన సమీర్



ఎల్లారెడ్డిరూరల్: మండల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి సమీర్ హిమాలయ పర్వతాన్ని అధిరోహించినట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సమీర్ ఈనెల 2 నుంచి 12వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిర్వహించే జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపునకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అక్కడ ట్రైనర్ సోనమ్‌తో కలిసి సముద్రమట్టానికి 2875 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ పర్వతాన్ని అధిరోహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థి సమీర్‌ను అధ్యాపకులు కృష్ణప్రసాద్, జయప్రకాశ్, ప్రభాకర్‌రావు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఫరీదుపేట విద్యార్థిని



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.శీర్షిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నాగరాజు తెలిపారు. ఈ నెల 16,17,18వ తేదీలలో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కబడ్డీ పోటీలలో శీర్షిక పాల్గొననున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌మనోహర్ రావు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ గంగాధర్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: పీడీఎస్ బియ్యం కేసులో నిందితుడిగా ఉన్న రిజ్వాన్ పరారీలో ఉండగా ఆరవ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సౌత్ సీఐ వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. గత ఏడాది ఆరవ టౌన్ పీఎస్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పోలీసులు సంయుక్తంగా గోదాంలో దాడులు నిర్వహించారు. పీడీఎస్ బియ్యంతోపాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో పోలీసులకు కంట్రీమేడ్ తుపాకీ తోపాటు కత్తులు, గొడ్డలి లభించాయి. ఇందులో ప్రధాన నిందితుడు మిర్జా హంజాల బెగ్‌ను అరెస్ట్ చేయగా రెండో నిందితుడిగా ఉన్న రిజ్వాన్‌ను అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఏఎంసీలపై ఆశావహుల కన్ను

- 2016 నుంచి రిజర్వేషన్లను కేటాయించిన గత ప్రభుత్వం
- వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- రిజర్వేషన్ల కొనసాగింపుపై స్పష్టత కరువు



ఆర్మూర్ ఏఎంసీ కార్యాలయం

ఆర్మూర్: రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లను రద్దు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో అధికార పార్టీ నాయకుల్లో, ఆశావహులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్‌లకు రిజర్వేషన్ల కేటాయింపును ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక తొలగిస్తుందా అనే విషయమై స్పష్టత రాలేదు. జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్‌లతో పాటు కిసాన్‌నగర్‌లో సబ్ యార్డు ఉన్నాయి. ఈ ఏడు మార్కెట్ యార్డులకు చైర్ పర్సన్‌లతో పాటు పాలకవర్గాన్ని నామినేటెడ్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. 2016లో నాటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌ల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు చైర్ పర్సన్ స్థానాలను కేటాయిస్తూ మొదటి సారిగా రిజర్వేషన్ పద్ధతిని ప్రారంభించింది. ఐదు పర్యాయాలు చైర్‌పర్సన్ పీఠానికి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కేటాయించిన రిజర్వేషన్ల ఆధారంగా బీఆర్‌ఎస్ నాయకులను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పీఠాలకు నామినేట్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న చైర్ పర్సన్‌లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుంటూ తమ పదవీ కాలాన్ని విడతల వారిగా పెంచుకుంటూ వచ్చారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో వీరు పదవులు కోల్పోవాల్సి వచ్చింది. కానీ అధికారికంగా ఇంకా ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే నాయకులను నామినేటెడ్ చేసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఆయా పార్టీలలో రాజకీయ నిరుద్యోగులకు కమిటీల్లో అవకాశం కల్పిస్తూ బుజ్జగించే ధోరణి ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తోంది. అదే ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ కొనసాగనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే రిజర్వేషన్లు పాటిస్తారా? లేదా అనే అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది.

పోతంగల్ విండో పాలకవర్గాన్ని రద్దు చేయాలి

- కార్యదర్శిని తొలగించాలి
- మహాజన సభలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న అధ్యక్షుడు శాంతేశ్వర్ పటేల్

రుద్రూర్: పోతంగల్ విండో పాలక వర్గాన్ని రద్దు చేసి, సంఘ కార్యదర్శి భరత్‌ను తొలగించాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. పోతంగల్ విశాల సహకార సంఘం 86వ మహాజన సభను సంఘ అధ్యక్షుడు శాంతేశ్వర్ పటేల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గత సెప్టెంబర్‌లో నిర్వహించాల్సిన మహాజన సభను ఆలస్యంగా ఎందుకు ఏర్పాటు చేశారని సభ్యులు ప్రశ్నించారు. సకాలంలో సంఘానికి సంబంధించిన లెక్కలు పూర్తి కానందున మహాసభ ఏర్పాటులో జాప్యం జరిగిందని కార్యదర్శి భరత్ ఇచ్చిన సమాధానంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యయం, దీని వల్ల కలిగిన నష్టంలో ప్రతి పైసా రికవరీ చేయాలని, కార్యదర్శిని తొలగించి పాలకవర్గం రద్దు చేయాలని సభ్యులు ఏకగ్రీవం తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని డీసీవోకు పంపించి సంఘం నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. చివరగా సంఘ అధ్యక్షుడు శాంతేశ్వర్ పటేల్ మాట్లాడుతూ.. పాలకవర్గం ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేశారు. కార్యదర్శి నిర్లక్ష్యంపై జిల్లా సహకార అధికారి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వివరించారు. విండో పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పండుగల విశిష్టత తెలుసుకోవాలి

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



సుభాష్‌నగర్: ప్రతి ఒక్కరూ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీఎస్‌ఓ చంద్రప్రకాశ్ ముగ్గులను వీక్షించారు. అనంతరం విజేతలకు అదనపు బహుమతులను అందజేశారు. కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్‌కుమార్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలుక కిషన్, నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, ఎం సతీశ్‌కుమార్, కేపీ సునీత, వసుమతి దేవి, మంజుల, ఇందిరా, విజయలక్ష్మి, సంధ్యారాణి, నాయకులు జాఫర్ హుస్సేన్, సంజీవయ్య, సత్యం, దినేశ్ బాబు, మహేందర్, ఉమా కిరణ్, సతీశ్, ప్రవీణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను తిరగనీయొద్దు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రహదారులపై ఆవులు, గేదెలు, పెంపుడు జంతువులు తిరిగితే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మందమకరందు శుక్రవారం పేర్కొన్నారు. జంతువులు ఆరుబటయ తిరిగితే ప్రజలకు మెదడువాపు, స్వైన్‌ఫ్లూ, మలేరియా, డెంగీ ఇతర వ్యాధుల బారిన పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చట్టం ప్రకారం 2019 160(1), 160(2) ప్రకారం పందులు, ఇతర జంతువులు రోడ్లపై సంచరించడం నేరమన్నారు. పశువులు రోడ్డుపై తిరిగితే యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు మారథాన్ పోటీలు



మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై కొమరయ్య

కామారెడ్డి అర్బన్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ రోడ్డులో దివ్యహస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మారథాన్ పోటీలు నిర్వహించారు. మారథాన్‌ను ఎస్సై కొమురయ్య జెండా ఊపి ప్రారంభించారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకురాలు పోశవ్వ పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దివ్యహస్తం ప్రతినిధులు చింతల పోశవ్వ, లక్ష్మీపతి, చిరంజీవి, ఏడుకొండలు, మంజుల, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీ పరిశీలకురాలిగా నీరజారెడ్డి



నీరజారెడ్డి

డిచ్‌పల్లి: సిద్దిపేట జిల్లా కొండపాకలో ఈ నెల 12 నుంచి నిర్వహించే రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్–19 సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు రాష్ట్ర పరిశీలకురాలిగా ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి వ్యవహరిస్తారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గంగాధర్ శుక్రవారం తెలిపారు. నీరజారెడ్డి ధర్మారంలో ఉన్న గురుకుల పాఠశాల/కళాశాల, పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం నీరజారెడ్డిని సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మయ్య, ప్రాంతీయ అధికారిణి అలివేలు, ధర్మారం కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గంగాధర్, సంగీతరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టి.విద్యాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రభాకర్ రెడ్డి, మర్కంటి గంగామోహన్, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి సొప్పరి వినోద్ తదితరులు అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



లక్మోరలో సమావేశమైన బోధన్‌లోని శ్రీరాజరత్న పాఠశాల పూర్వ విద్యార్థులు

వేల్పూర్: మండలంలోని లక్మోరలో బోధన్‌లోని శ్రీ రాజరత్న హైస్కూలులో పదో తరగతి చదివిన 1996–97 పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాసాకొత్తూర్‌లో..

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.



సమ్మేళనంలో పాల్గొన్న హాసాకొత్తూర్ పూర్వ విద్యార్థులు

ఈఎన్‌టీ క్లినిక్ సీజ్

నిజామాబాద్‌నాగారం: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆర్మూర్‌లోని నక్షత ఈఎన్‌టీ క్లినిక్‌ను వైద్యశాఖ అధికారులు తనిఖీచేసి శుక్రవారం సీజ్ చేశారు. జిల్లా వైద్యశాఖ ఆదేశాల మేరకు ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, డెమో గంగాధర్, డాక్టర్ వెంకటేశ్, డీహెచ్‌ఈ రమ తనిఖీ చేపట్టారు. అనుమతి లేకుండా నడుపుతున్నందుకు ఈఎన్‌టీని సీజ్ చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వర్ని: మండలంలోని సైదిపూర్‌లో పంట చేనుకు వేసిన కరెంటు తీగ తగిలి గేదె మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన హంగోత్ హున్న మక్కా పొలానికి అనుమతి లేకుండా కరెంటు తీగలు పెట్టగా అదే గ్రామానికి చెందిన కేతావత్ నాణ్యకు చెందిన గేదె ప్రమాదవశాత్తు తగిలి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

బిల్లు కడితేనే మృతదేహం ఇస్తాం

- నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం
- బంధువుల ఆందోళనతో వెనక్కి తగ్గిన యాజమాన్యం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నయీం అనే వ్యక్తి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం బిల్లుల విషయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 5న నయీం పోతంగల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. తలకు తీవ్రగాయం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. అనంతరం చికిత్స పొందుతూ నయీం మృతి చెందాడు. చికిత్స కోసం అయిన రూ. 2 లక్షల బిల్లు కడితేనే మృతదేహం ఇస్తామని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో బాధిత కుటుంబీకులు ధర్నాకు దిగారు. దీంతో బిల్లు చెల్లించకపోయినా ఆస్పత్రి యాజమాన్యం మృతదేహాన్ని అప్పగించింది.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

నస్రుల్లాబాద్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన టి.గోపి(28) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి తన గదిలో నిద్రించిన గోపి ఉదయం తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పగులగొట్టి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ శుక్రవారం తీర్పులో పేర్కొన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన వేముల శివయ్య డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. శివయ్యను కోర్టులో హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఏసీపీ నారాయణ పేర్కొన్నారు.

భిక్కనూరులో బైక్ చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో ఓ బైక్ శుక్రవారం చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పున్న గంగయ్య మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంకు బైక్‌పై వచ్చాడు. బైక్‌ను ఏటీఎం ఎదుట నిలిపి లోపలికి వెళ్లి వచ్చే లోగా దుండగులు చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచ్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రెంజల్: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. బోధన్ మండలం కొప్పెర్గ గ్రామం నుంచి మండలంలోని నీలా శివారులో డంప్ చేసేందుకు శుక్రవారం తెల్లవారుజామున తీసుకొస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుబాయిలో బోనాల్ వాసి మృతి

లింగంపేట: మండలంలోని బోనాల గ్రామానికి చెందిన గరిగె ప్రభాకర్(32) దుబాయిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. ప్రభాకర్‌కు భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఎనిమిది నెలల క్రితం ఆయన దుబాయి వెళ్లాడు. అప్పటి నుంచి ఆచూకీ లేదు. ప్రభాకర్ ఆచూకీ కోసం తండ్రి పర్వయ్య అనేక ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ క్రమంలో మనస్తాపంతో పర్వయ్య మూడు నెలల క్రితం మృతిచెందాడు. కాగా ప్రభాకర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. శుక్రవారం మృతదేహం హైదరాబాద్‌కు చేరుకున్నట్లు సమాచారం రావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహేతర సంబంధానికి నిండుప్రాణం బలి..

మూడురోజుల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

డిచ్‌పల్లి: వివాహేతర సంబంధానికి ఓ నిండుప్రాణం బలైంది. ఈ నెల 8న ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి శివారులో హత్యకు గురైన లవుడ్య నరేశ్ (21) హత్య కేసును పోలీసులు మూడు రోజుల్లో ఛేదించి నిందితుడిని పట్టుకున్నారు. డిచ్‌పల్లి సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను సీఐ కృష్ణ వివరించారు. వెంగల్‌పాడ్ తండా (పాటితండా)కు చెందిన నరేశ్ గత నెల డిసెంబర్ 30న ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదని తల్లి నీల ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 8న నరేశ్ మృతదేహం తిర్మన్‌పల్లి శివారులోని రైలు పట్టాలపై కనిపించింది. ఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ ఇందల్వాయి ఎస్సై మహేశ్‌తో కలిసి పరిశీలించగా బండరాయితో మోది హత్య చేసినట్లు గుర్తించారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టారు. హతుడు కనిపించకుండా పోయిన రోజున అతడితో పాటు కేకే తండాకు చెందిన కేతావత్ రాజేశ్‌తో కలిసి తిర్మన్‌పల్లి కల్లుబట్టి వద్ద కలిసి కల్లుతాగి వెళ్లినట్లు విచారణలో తేలింది. సాంకేతిక ఆధారాలతో ఇందల్వాయి పోలీసులు నిందితుడు రాజేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం..

రాజేశ్ భార్యతో నరేశ్ కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా గుర్తించిన రాజేశ్ భార్యతో గొడవ పడ్డాడు. నరేశ్‌ను చంపితే కానీ సమస్య పరిష్కారం కాదని భావించిన రాజేశ్ గత నెల 30న పక్కా ప్లాన్ ప్రకారం పాటితండాకు చేరుకున్నాడు. నరేశ్‌ను కల్లు తాగుదామని పిలిచి తిర్మన్‌పల్లి కల్లుబట్టి వద్దకు తీసుకెళ్లాడు. కల్లుతాగిన తర్వాత బాగా మత్తులో ఉన్న అతన్ని రైలుపట్టాలకు కొద్దిదూరంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి తలపై బండరాయితో మోది హత్య చేశాడు. ఈ నెల 8న మృతదేహం లభించడంతో విచారణ చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న రాజేశ్‌ను ఈ నెల 11న అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో అతడి వద్ద నుంచి మృతుడికి సంబంధించిన సెల్‌ఫోన్‌తో పాటు ఘటన స్థలం వద్ద హత్యకు ఉపయోగించిన బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్, హెడ్‌కానిస్టేబుళ్లు రాజేశ్వర్, ప్రసాద్, కానిస్టేబుళ్లు సర్దార్, సతీశ్, కిశోర్, రామును సీపీ కల్మేశ్వర్, ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ శివారులో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఏర్గట్ల మండలం తడ్‌పాకల్‌కు చెందిన సంతోష్(45) అక్కడికక్కడే మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై గోపీ శుక్రవారం తెలిపిన వివాల ప్రకారం.. సంతోష్ మూడు రోజుల క్రితం కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న తన తండ్రి వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో రాత్రికి ఆరు బయటకు వెళ్లగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడు..

ఖలీల్‌వాడి: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్మూర్‌కు వెళ్లే రైలు పట్టాలపై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712658591, 9440999341 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

భర్త మృతి తట్టుకోలేక భార్య..



పుల్ల రాములు (ఫైల్)



పుల్ల పుష్పమ్మ (ఫైల్)

నాగిరెడ్డిపేట: తోడూ నీడై నిలిచిన భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో తట్టుకోలేని భార్య తనువుచాలించిన ఘటన మండలంలోని మాసాన్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పుల్ల రాములు (64) గత నెల డిసెంబర్ 25న అనారోగ్యంతో మృతి చెందాడు. నాటి నుంటి భర్త గురించి ఆలోచిస్తూ అనారోగ్యానికి గురైన భార్య పుష్పమ్మ(57) మృతి చెందింది. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

ఆరుగురిపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన తనిఖీలో ఆరుగురు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరి శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. వీరి నుంచి రూ. ఆరువేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



సాయికుమార్ మృతదేహం

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన నాగారం సాయి కుమార్ (22) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై నీరేశ్ శుక్రవారం తెలిపారు. మద్యానికి బానిసైన సాయికుమార్ ప్రతి రోజు ఇంట్లో డబ్బుల కోసం గొడవ పడేవాడు. కుటుంబీకులు డబ్బులు ఇవ్వనందున బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న సాయికుమార్ గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్‌షాపుపై అధికారుల దాడి

- 85 క్వింటాళ్ల బియ్యం తేడా
- రేషన్ డీలర్‌పై కేసు నమోదు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం తాడ్కోల్‌లోని 6వనెంబర్ రేషన్‌షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈపాస్ యంత్రంలో స్టాక్ రిజిష్టర్‌ను గ్రౌండ్‌బ్యాలెన్స్‌తో సరి చూడగా తేడా వచ్చింది. 85 క్వింటాళ్ల బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించిన అధికారులు రేషన్‌డీలర్ గంగాధర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. దీంతో రేషన్‌డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సత్యనారాయణ తెలిపారు. రేషన్ షాపును సీజ్ చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు పట్టణ కేంద్రానికి చెందిన సల్లావుద్దీన్ ఇంట్లో దాడులు చేయగా 60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. టాస్క్ ఫోర్స్ సీఐలు అంజయ్య, అజయ్ బాబు, సిబ్బంది ఉన్నారు.

కిలో గంజాయి స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరహరి శుక్రవారం తెలిపారు. నగరంలోని ఖలీల్‌వాడికి చెందిన సయ్యద్ సాజిద్ అలీ వద్ద 1250 గ్రాముల గంజాయి, రూ. 10 వేల నగదు స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. చంద్రశేఖర్ కాలనీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారంతో అందడంతో నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఆనీస్ వద్ద కొనుగోలు చేసి రూ. 200లకు ప్యాకెట్ అమ్ముతున్నట్లు చెప్పారు. ఎస్సై ప్రవీణ్, సిబ్బంది అప్సర్, షౌకత్ అలీ, గంగ కుమార్, లీలా కృష్ణ ఉన్నారు.